

బోనం.. వైభవం

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఊరూరా బోనాల సందడి నెలకొంది. మంగళవారం ఆమనగల్లు, కడ్తాల్ మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలతో గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతీయువకుల కేరింతలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో నాయకులు కాలె మల్లయ్య, చెన్నకేశవులు, ఎనుముల రమేశ్, దేవేందర్, యాదగిరి, శివకుమార్, శివ, ప్రకాశ్, చెన్నకేశవులు, కుమార్, శేఖర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

- ఆమనగల్లు/కడ్తాల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి)

హరిత సోయగం

కందుకూరు మండలంలోని నేదునూరు గ్రామానికి వెళ్లే రోడ్డు పచ్చని పూల చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతోంది. వన మహోత్సవంలో భాగంగా ఈ దారికి ఇరువైపులా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లడానికి సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డు పక్కన పూల చెట్లు ఈ గ్రామానికి వచ్చిపోయే వారిని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి)





ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

» అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

షాద్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆగ్రో దుకాణాల యజమానులను హెచ్చరించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు ఆగ్రో దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగ్రో షాపులో ఉన్న గోదాములు, ఈపాస్ మిషన్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రతీ రోజు మండలాలకు 500 బస్తాల యూరియా సరఫరా అవుతుందని తెలిపారు. ఎవరైనా యూరియా లేదంటూ రైతులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా యూరియా షాపుల వద్ద రైతులతో కాసేపు మాట్లాడారు. తనిఖీలో షాద్‌నగర్ సహాయ సంచాలకులు రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిషాంత్ తదితరులు ఉన్నారు.

మా టీచర్‌ను మాకు పంపించండి

» కలెక్టర్‌కు ఓ విద్యార్థి లేఖ




కొందుర్గు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని తిరిగి పాఠశాలకు పంపించాలని కోరుతూ కలెక్టర్‌కు ఓ విద్యార్థి లేఖ రాశాడు. విద్యార్థి కలెక్టర్‌కు రాసిన ఉత్తరం మంగళవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. కొందుర్గు మండల పరిధిలోని చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి క్రిశాంక్ 4వ తరగతి చదువుతున్నాడు.ఈనెల 13వ తేదీన కొందుర్గు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ రోడ్డుపై బైఠాయించి విద్యార్థులు టీచర్ కోసం ధర్నా చేపట్టారు. తమ పాఠశాలలో 46 మంది విద్యార్థులు ఉన్నామని, ఇద్దరు టీచర్లు ఉండగా ఒక టీచర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మా టీచర్‌ను మా పాఠశాలకు పంపించండి కలెక్టర్ సారూ.. అని విద్యార్థి ఉత్తరంలో పేర్కొన్నాడు.

ఆధునిక హంగులతో

పక్కా భవనాలు

ఏళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాల కల సాకారం కానుంది. దేశంలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేని విషయం తెలిసిందే. ఏటా రూ.వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్నప్పటికీ ఈ కార్యాలయాలు అరకొర సౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాలు నిర్మిస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఒకే చోట నాలుగైదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేలా సమీకృత భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శాశ్వత నిర్మాణాలు



బహిరంగ సభకు సిద్ధమవుతున్న వేదిక



సమీకృత భవన శంకుస్థాపనకు ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం

ఒకే చోట నాలుగైదు కార్యాలయాల ఏర్పాటు

తొలి విడతగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో..

గచ్చిబౌలిలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): తొలి విడతగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం అత్యాధునిక హంగులతో 11 సమీకృత భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) కార్యాలయ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఒక్కో సమీకృత భవనంలో 10 నుంచి 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో

మిగతా 7వ పేజీలో...

సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలు ఇలా..

- గచ్చిబౌలి(తాలిమ్ ఆవరణ): రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- కోహెడ: అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట, హయత్‌నగర్, వనస్థలిపురం
- మంఖాల్: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్
- కండ్లకోయ: మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు కీసర, శామీర్‌పేట
- బోడుప్పల్: ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజిగిరి

పంట మార్పిడితో చీడపీడల నివారణ

» జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్



మాట్లాడుతున్న సురేశ్

యాచారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో చీడపీడలు నివారించవచ్చని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సురేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో పొలంబడి కార్యక్రమం సందర్భంగా కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయలను పాడుచేసే క్రిమికీటకాలను నివారించడానికి పొలంలో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మందులు పిచికారీ చేసిన నాలుగు రోజులకు పంట కోత కోసుకోవాలన్నారు. సొంతంగా విత్తనాలను తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి రవినాథ్, రాధ, డాక్టర్ బసవన్న తదితరులు ఉన్నారు.



రోడ్డు ఇలా.. మెడిసిన్స్ తెచ్చుకునేదెలా?

డీఎంహెచ్‌వో ఆఫీసు వద్ద నీటిగుండాన్ని తలపిస్తున్న రోడ్డు

8

విమాన రాకపోకలకు అంతరాయం

ప్రతికూల వాతావరణం, సాంకేతిక లోపం కారణం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో సాంకేతిక లోపం, ప్రతికూల వాతావరణం కారణంగా మూడు విమానాలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం 5.55 గంటలకు శంషాబాద్ నుంచి తిరుపతికి ఎయిర్ ఇండియా విమానం 9ఐ 877 బయలుదేరింది. టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే సాంకేతిక లోపం గుర్తించిన పైలెట్ విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. దీంతో భయాందోళనకు గురైన 53 మంది ప్రయాణికులు విమానయాన సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు, అధికారులు విమానాన్ని రద్దు చేసి, ప్రయాణికులకు టికెట్ డబ్బులు తిరిగి చెల్లించారు. అలాగే, ముంబైలో వాతావరణం అనుకూలించకపోవడంతో మరో రెండు విమానాలు శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. శంషాబాద్ నుంచి ముంబై బయలుదేరిన ఇండిగో విమానం 6ఈ 5384 తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దామమ్ నుంచి ముంబై వెళ్లాల్సిన 6ఈ 54 విమానాన్ని కూడా అక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో శంషాబాద్‌కు దారి మళ్లించారు. ఈ రెండు విమానాలు సురక్షితంగా ల్యాండ్ అవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం మెరుగుపడిన తర్వాత తిరిగి ముంబై పంపించారు.



అవినీతి అధికారుల్లో

గుబులు

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్వేయర్

ఆమనగల్లులో లంచావతారులపై చర్చ.. ఒక్కో పనికి ఒక్కో రేటు పెడుతున్నారని ఆరోపణలు

ఆమనగల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ సోదాలు, దాడి కలకలం రేపింది. ఎక్కడ చూసినా ఇదేచర్చ మొదలైంది. జూలై 1న తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున ఏసీబీకి పట్టుబడిన ఘటన మరువకముందే ఆమనగల్లు తహసీల్దార్ లలిత, సర్వేయర్ రవిని అరెస్ట్ కావడంతో అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది. లంచాలకు మరిగిన అధికారులు ప్రతీ పనికి డబ్బు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఉద్యోగిని ద్వారా చాలాకాలంగా తహసీల్దార్ డబ్బు తీసుకుంటుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీకి తహసీల్దార్ పట్టుబడడంతో

మిగతా 8వ పేజీలో...



కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



షీల్డ్ అందుకుంటున్న భద్రాద్రి కొత్తగూడెం జట్టు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించిన అండర్ - 15 విభాగంలో బాల బాలికల 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్ మంగళవారం ముగిశాయి. బాలుర వాలీబాల్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి స్థానంలో నిలువగా రంగారెడ్డి, మంచిర్యాల జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. అలాగే, బాలికల వాలీబాల్‌లో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలువగా సూర్యాపేట్, నారాయణపేట్ జిల్లాలు రెండు, మూడు స్థానాలు సాధించాయి. ఎంఈవో హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు విజేత జట్లకు మెమొంటోలు అందజేశారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి పూణేలో జరుగబోయే జాతీయ స్థాయి టోర్నీలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ క్రీడలకు ఆతిథ్యమిచ్చిన గురుకుల విద్యాపీఠ్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, క్రీడల అబ్జర్వర్లు వెంకట్‌నారాయణ, కవిత, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

అలుగు పారుతున్న చెరువులు, కుంటలు

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ముసురుకున్న వాన

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఎడతెరిపి లేకుండా ముసురుకుంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కురిసిన వర్షానికి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం జేపీఎన్‌నగర్‌లో 52.0 మిల్లీ మీటర్లు, శేరిలింగంపల్లిలోని పీజేఆర్ స్టేడియం వద్ద 47.5 మిల్లిమీటర్లు, శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలిలో 41.3 మి.మీ, శేరిలింగంపల్లిలో 46.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి మండలం కూకట్‌పల్లిలోని ఈఎస్ఎస్ హెచ్ఎంటీ హిల్స్ హైదర్‌నగర్‌లో 46.8 మి.మీ, బాచుపల్లిలో 40.5 మి.మీ, రాజీవ్‌నగర్ గృహకల్ప వద్ద 40.8 మి.మీ, కూకట్‌పల్లిలో 40.3 మి.మీ, బాలానగర్‌లో 39.8 మి.మీ, మల్కాజిగిరిలో 30.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యధికంగా 36.8 మిల్లీ మీటర్లు, మోమిన్‌పేటలో 35.3 మి.మీ, నవాబుపేటలో 25.0 మి.మీ, పరిగిలో 21.3 మి.మీ, పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్‌లో 23.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తోజుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణ వర్షపు నీటితో కుంటను తలపించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.



ఆమనగల్లు: చెరువును తలపిస్తున్న ముర్తోజుపల్లి బడి



గణనాథుల తరలింపులో ఇబ్బందులు


బ్రిడ్జి వద్ద నిలిచిన వినాయక విగ్రహం

ఘట్‌కేసర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల వారు గణనాథుల విగ్రహాలను తరలిస్తున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్ వద్ద, అన్నోజిగూడలో భారీ వినాయక విగ్రహాలను విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు ట్రాలీలను తెచ్చి విగ్రహాలను తరలిస్తున్నారు. అయితే భారీ గణనాథుల తరలింపులో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్‌లోని ఔటర్ రింగ్ రోడ్ చౌరస్తా బ్రిడ్జి వద్ద విగ్రహాలు బ్రిడ్జి ఎత్తుకు సమానంగా ఉండటంతో క్రేన్‌తో కిందికి దింపి బ్రిడ్జిని దాటిస్తున్నారు.



ఘనంగా సుదర్శన హోమం


సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బి.నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, జి.నర్సింహులు, కానుగు అంతయ్య, గంధం ఆనంద్, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, టి.దామోదర్‌రెడ్డి, నర్సింహులుగుప్తా, ఆర్.కృష్ణయ్య, ఈగ వెంకట్‌రాంరెడ్డి, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణానికి మాజీ ఎంపీపీ రూ.2.5లక్షల విరాళం

పెద్ద జానంపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో యాగశాల నిర్మాణానికి కొత్తూర్ మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ రెండున్నర లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవంతో పాటు యాగశాల కోసం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సమక్షంలో విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా శివశంకర్‌గౌడ్‌ను నిర్వాహకులు సన్మానించి ఆశీర్వదించారు.


◄ యాగశాలకు విరాళమిస్తున్న శివశంకర్‌గౌడ్

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

● వర్షంలోనే వీర్లపల్లి వార్డు పర్యటన


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం జల్లుల్లోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వార్డు పర్యటన చేపట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి రెండో వార్డులో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, కరెంటు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ప్రతి వార్డులో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని, పరిశీలిస్తున్నానని ఎమ్మెల్యే న్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన, తాను గమనించిన సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తానని చెప్పారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ సునీత, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, సి.రాజేందర్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అందె మోహన్, ఖదీర్, మురళీమోహన్, శ్రీనునాయక్, మజూద్‌ఖాన్, భగవాన్‌దాస్, మాధవులు పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా యూరియా


గోదాంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వానకాలం పంటల సాగుకు యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.మోతాదుకు మించి రైతులు యూరియా వాడితే భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలోని మన గ్రోమోర్ సెంటర్ గోదాంను మంగళవారం ఆర్డీవో సందర్శించారు. ఆమనగల్లు ఏడీఏ శోభారాణితో కలిసి గోదాంలో యూరియా నిల్వలను, రికార్డులను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని అధికారులు సూచించారు. యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్యాడీ యాక్షన్ ప్లాన్‌పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ 2025-26లో రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని సకాలంలో మిల్లర్లకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 14 వద్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి అవసరమైన గన్నీ సంచుల సమీకరణ, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, ధాన్యం తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. తేమశాతం 17లోపే ఉండాలని, తేమ ఉన్న ధాన్యం తీసుకురావడం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుగుణాబాయి, సివిల్ సప్లయీస్ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, జిల్లా సహకార శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శత రుద్రాభిషేకం


మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం

వికారాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం తెలంగాణ జంగమ సమాజం, జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మల్లికార్జున భవనంలో ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు, రాష్ట్ర ఆగమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మఠపతి సాంబశివశర్మ, బసవరాజస్వామి, మఠం శివానందం, పురాణం నాగయ్యస్వామి,మఠం చంద్రశేఖరస్వామి, మహంతయ్య స్వామిల నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శత రుద్రాభిషేకం కొనసాగింది. మల్లికార్జునస్వామికి డాక్టర్ ముద్ద దీప-భక్తవత్సలం దంపతులు, జ్యోతిప్రభ శాస్త్రోక్తంగా శతరుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కిషన్‌నగర్ కాశీపీఠం వేద పాఠశాల నిర్వాహకులు సంగయ్యస్వామి, జ్ఞానేశ్వర్, సంగయ్యస్వామి, మందీపల్ రాజశేఖర్, శివశంకర్, విశ్వం పంతులు, రాజయ్యస్వామి, పులుమద్ది మల్లేశం, మహేశ్వర్, వీరేశలింగం, శ్రీకాంత్, మల్లేశం, ప్రభులింగం, మల్లికార్జున్, అనిల్, నరేశ్, వివిధ జిల్లాల జంగమ అర్చకులు 108మందికిపైగా పాల్గొన్నారు. హిందూధర్మం, శైవ వైశిష్టతపై పండితులు ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు స్వామి దర్శించుకున్నారు.


భక్తులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేద పండితులు








బొంరాస్‌పేట్: మహంతీపూర్ వద్ద ప్రవహిస్తున్న కాకరవాణి ప్రాజెక్టు


అనంతగిరిలో జలపాతం


ఘట్‌కేసర్‌లో ప్రవహిస్తున్న ఎరిమల్లెవాగు

పొంగిన వాగులు

ముసురుతో ప్రజల ఇబ్బందులు

- నిండిన చెరువు, కుంటలు
- రోడ్లపై నీటి ప్రవాహంతో ఇక్కట్లు
- పలు చోట్ల విరిగిపడిన చెట్లు


ఘట్‌కేసర్ రూరల్ : ఎదులాబాద్ సమీపంలో ప్రవహిస్తున్న మూసీ నది

వికారాబాద్/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు, వంకలు పొంగుతున్నాయి. చెరువు, కుంటల్లోకి నీరు చేరింది. రోడ్లపై, కాలనీల్లో నీరు నిలిచింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు, పనుల కోసం బయటకు వెళ్లే వారు వానలో తడుస్తూనే గమ్యస్థానాలకు చేరారు. వికారాబాద్ మండలం అనంతగిరి ఘాట్ రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది వాటిని తొలగింపజేశారు. అనంతగిరిలో జలపాతం కనువిందు చేస్తోంది. వాటిని చేసేందుకు పర్యాటకులు చేరుకుంటున్నారు. వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంటలు నీరేస్తున్నాయని రైతులు ఆవేదన చెబుతున్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8గంటల నుంచి మంగళవారం ఉదయం 6గంటల వరకు 17.6మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షాలకు ఎరిమల్లెవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ అలుగెల్లింది. గాలి వీయడంతో రాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడింది. కురుస్తున్న భారీ వర్షాలకు మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఘట్కేసర్ మండలం ప్రతాప్‌సింగారం, కొర్రెముల, ఎదులాబాద్ సమీపంలో మూసీ ఉగ్రరూపం దాలుస్తోంది. కొర్రెముల, ప్రతాప్‌సింగారంలలో నీరు బ్రిడ్జికి తాకుతోంది. చెరువులు నిండాయి.



రోడ్లపై నీటి ఉధృతి

ప్రవహిస్తున్న సంగెంకలాన్ వాగు

తాండూరు రూరల్/ధారూరు/పెద్దేముల్/బొంరాస్‌పేట్/కులకచర్ల: తాండూరు మండలం సంగెంకలాన్ వాగు మంగళవారం ఉధృతంగా ప్రవహించింది. ఈ మార్గం గుండా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ధారూరు మండలంలో చెరువులు, వాగులు, కుంటలు పొంగిపొర్లాయి. ఎబ్బనూర్ చెరువు అలుగుపారుతోంది. అలాగే చింతకుంట, నాగారం, మోమిన్‌కుర్దు వాగులు పొంగాయి. ఇటీవల తెగిన గురుదోట్ల చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువుకట్టకు మట్టిపోయించి ఇసుక బస్తాలు పేర్చారు. నీరు పోకుండా కట్టడి చేశారు. పెద్దేముల్ మండలంలో మంగళవారం జోరు వాన కురిసింది. జైరాం తండా సమీప వాడుకలో వరదనీరు ప్రవహించింది. గంటపాటు ధారూర్ వాగుతండా-జైరాంతండాల మధ్య రాకపోకలు నిలిచాయి. నీరు నిలిచి పెసరపంట దెబ్బతింది. బొంరాస్‌పేట్ మండలంలో చెరువులు, వాగులు అలుగు పారుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాకరవాణి ప్రాజెక్టు ఉధృతంగా ప్రవహిస్తోంది. బొంరాస్‌పేట్-మహంతీపూర్‌ల మధ్య రాకపోకలు నిలిచాయి. కులకచర్ల మండలంలో చెరువులు అలుగుపారుతున్నాయి. తిరుమలాపూర్, అంతారం, కులకచర్ల, ముజాహిద్‌పూర్ చెరువులు అలుగెల్లుతున్నాయి. ముజాహిద్‌పూర్-అల్లాపూర్‌కు రోడ్డు కోతకు గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు. రాంనగర్ వద్ద కల్వర్టును పరిశీలించారు. ప్రజలు చెరువులు, వాగులు, కుంటల వద్దకు వెళ్లొద్దని సూచించారు.


ధారూరు: రోడ్డుపై పారుతున్న చింతకుంట వాగు

వరద నివారణ చర్యలేవి?

బషీరాబాద్: లోతట్టు ప్రాంతాల ఇళ్ల, కాలనీల్లో వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల నివారణకు అధికారులు ముందస్తు ప్రణాళికలేవీ చేపట్టడం లేదు. మండలంలోని 10కిపైగా పంచాయతీలు, తండాల్లో ముంపు ప్రభావం ఉంది. బషీరాబాద్ రోడ్డులోని చున్నంబట్టి వద్ద ఇరుకైన కల్వర్టుతో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. జీవన్గి ఎస్సీ కాలనీలో భారీగా నీరు చేరింది. మాసన్‌పల్లి పాఠశాల మైదానంలోకి రోడ్డుపై నుంచి వచ్చే నీరు చేరుతూ రోజుల నిలుస్తోంది. కొర్విచెడ్‌ఘనిలో ఇళ్లలోకి వరదొచ్చి ముంచెత్తుతోంది.


నందివాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాస్లాబాద్ (నందివాగు ప్రాజెక్టు) వద్ద చెరువు నీటి మట్టం పెరిగి ప్రవహిస్తుండటంతో ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్‌లు పరిశీలించారు. వాగులు, చెరువులు, కుంటల్లో ప్రవాహ ఉధృతి ఉందని, వాటి వద్దకు ప్రజలు వెళ్లొద్దన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. వారితో ఏఎస్సైలు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు.

పలు గ్రామాల్లో కూలిన ఇళ్లు

మర్పల్లి/దోమ: వర్షాలకు నాని మర్పల్లి మండల పలు గ్రామాల్లో ఐదిళ్లు కూలాయి. తుమ్మలపల్లి, గుర్రంగట్టు తండా, పిల్లిగుండ్ల, గుండ్ల మర్పల్లి గ్రామాల్లో ఇళ్లు కూలాయి. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం చేయాలని బాధితులు కోరారు. దోమ మండలంలో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. బాసుపల్లి కొత్త చెరువు అలుగు కోత పడింది. అయినాపూర్, గండాల గ్రామాల్లో ఒక్కో ఇల్లు కూలింది.


దోమ: అయినాపూర్‌లో కూలిన ఇల్లు


మర్పల్లి మండలంలో కూలిన ఇల్లు


నీట మునిగిన పత్తి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం

పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలి

ధారూరు: పొలాల్లో నిండిన వర్షపు నీటిని బయటకు తీసేయాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం రైతులకు సూచించారు. ధారూరులో నీటి మునిగిన పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. నీట మునిగిన మొక్కల వేర్లు కుళ్లుతాయని చెప్పారు. ఈ సమయంలో పంటలపై కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాముల మందును ప్రతీ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లపై పిచికారి చేయాలని చెప్పారు. కంది చేనులో అయితే మెటాలాక్సిన్ 2గ్రాముల నీటిలో కలిపి నేల తడిచేటట్టు మొక్కల మొదళ్ల వద్ద పోయాలని చెప్పారు. పంటలకు నానో లిక్విడ్ యూరియా వాడుకోవాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో పాతమామిడి తోటల పునరుజ్జీవంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏవోలు సూర్యప్రకాశ్, కరుణాకర్ రెడ్డి, శ్రావ్య ఉన్నారు.

ఆధునిక హంగులతో పక్కా భవనాలు

(ఐదో పేజీ తరువాయి)

కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్నారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయాలు, విశాలమైన పార్కింగ్ వంటి వసతులు ఉండేలా డిజైన్ రూపొందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో అత్యధునిక రీతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలను సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్నారు.

మూడెకరాలు కేటాయింపు

గచ్చిబౌలిలో నిర్మించే సమీకృత భవన నిర్మాణం కోసం మూడెకరాల స్థలాన్ని ఇటీవల ప్రభుత్వం కేటాయించింది. గతంలో సర్వే నంబర్ 91/2లో తాలిమ్‌కు ప్రభుత్వం 15.20 ఎకరాల స్థలాన్ని కేటాయించగా ఇందులో కొంత ఖాళీగానే ఉంది. దీంతో ఇక్కడ మూడెకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. గచ్చిబౌలిలో నిర్మించే సమీకృత భవన సముదాయంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఇలా మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా దశలవారీగా కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు నిర్మిస్తారు. వాస్తవానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రాష్ట్రంలోనే సింహభాగం ఆదాయం ఉమ్మడి జిల్లా నుంచే అందుతుంది. కానీ, ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నింటికీ సొంత భవనాలు సమకూరనున్నాయి. త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నారు.


అవార్డును అందుకుంటున్న ఆసిఫ్ జానీ

ఆసిఫ్ జానీకి 'భారత్‌కే అన్మోల్' అవార్డు

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్(దెబ్బడగూడ)కు చెందిన ఎండీ ఆసిఫ్ జానీ(స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ నిర్మాత) భారత్‌కే అన్మోల్-2025 ఢిల్లీ ఎడిషన్ జాతీయ అవార్డును అందుకున్నారు. సోమవారం రాత్రి ఢిల్లీలో ఇండో-కెనడియన్ న్యాయవాది సయ్యద్ నూర్, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్‌ఠాకూరుల నుంచి ఆసిఫ్ అవార్డును అందుకున్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత ఓపీఎస్‌ను పునరుద్ధరించే వరకు పీఆర్‌టీయు పోరాటం కొనసాగిస్తుందన్నారు. తలకొండపల్లి మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. పాఠశాలలను సందర్శించి పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, టీచర్ల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కడ్తాల మండల అధ్యక్షురాలు పద్మావతి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, చంద్రశేఖర్, వెంకటేశ్, ముత్తయ్య, సుదర్శన్, రవి, ప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలి

ఆదిబట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకొని సీపీఎస్‌ను రద్దుచేయాలని పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను ఆదిబట్ల పరిధి బొంగ్లూర్ మోడల్ స్కూల్‌లో ఆవిష్కరించారు. తాము అధికారంలోకొస్తే సీపీఎస్‌ను రద్దుచేస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఓపీఎస్ సాధన కోసం సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే నిర్వహించే మహాధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు పరమేశ్, కార్యదర్శి చంద్రశేఖర్, రాములు, టీచర్లు అమరావతి, కేదార్నాథ్, రామ్మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

బషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ భర్త శ్యామప్ప, మరో 100మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకున్నారు. ప్రజలతో ప్రజా ప్రతినిధుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నేతృత్వంలో మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్, బి.శంకరప్ప, సాయిరెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, మంజునాథ్, అర్జున్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎక్మాయి బీఆర్ఎస్ కార్యకర్తలు

'ప్రవాస్ యోజన'ను విజయవంతం చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రవాస్ యోజన(పల్లె పల్లెకూ బీజేపీ) కార్యక్రమాన్ని ఈనెల 21న చేవెళ్ల మండలంలో ప్రారంభిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు మున్నూర్ శ్రీకాంత్, చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చన్వెల్లిలో నిర్వహించే ప్రవాస్ యోజనకార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ రైతులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 22న ఉదయం ఆలూర్ గ్రామంలో మహిళలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3గంటలకు ఖానాపూర్ గేట్ వద్ద యువ సమ్మేళనం ఉంటుందని, బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, దేవుని శర్వలింగం, వెంకట్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అశోక్, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వండి


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ రేషన్‌కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్ ఆర్డీవో ఆఫీసులో మంగళవారం అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో సరిత, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉంటుందని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార వేగాన్ని పెంచాలని కోరారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నదాతలకు అండగా ఉండి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని ఆదేశించారు. సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఎన్నొచ్చాయని అడిగారు. వాటిని అర్హత, అవసరం ఉన్న రైతులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏవోలు నిశాంత్‌కుమార్, శోభారాణి పాల్గొన్నారు.


రాంచందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బీజేపీ చీఫ్‌కు నాయకుల సన్మానం

చేవెళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చీఫ్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడానికి మంగళవారం చేవెళ్ల మండలం మీదుగా వికారాబాద్ జిల్లాకు వెళ్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాంచందర్‌రావుకు చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గేట్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు అల్లి శ్రీశైలం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. మెడిసిన్స్ తెచ్చుకునేదెలా?

- డీఎంహెచ్‌వో ఆఫీసు వద్ద నీటిగుండాన్ని తలపిస్తున్న రోడ్డు
- డ్రైనేజీ వాటర్, వర్షపు నీరు నిలవడంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు



డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మందుల స్టోరేజీ పాయింట్


రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ, వర్షపు నీరు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పరిధిలో ఉండాల్సిన జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో ఉంది. కలెక్టరేట్ భవనం సరిపోకపోవడం.. శివరాంపల్లిలో పక్కా భవనం ఉండటంతో డీఎంహెచ్‌వో కార్యాలయం అక్కడ ఉంది. కానీ.. మెడిసిన్ స్టోరేజ్ పాయింట్, డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లేందుకు ఉద్యోగులు, మెడిసిన్ వాహనం వేళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. కార్యాలయం పక్కనే రోడ్డు మొత్తం డ్రైనేజీ, వర్షపునీటితో నిండిపోయి ఉంటోంది. దీనికితోడు పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టడం.. పాత ఇల్లు కూల్చివేసి రోడ్డు పక్కనే మట్టి, గ్రానైట్ డంపు చేయడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అత్యవసర మందులకు వెళ్లాలన్నా.. అక్కడ నుంచి పీహెచ్‌సీలకు మందులు తరలించాలన్నా.. ఇదే రోడ్డుపై నుంచి వాహనం రావాల్సి ఉంటుంది. వర్షం పడితే.. రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుందని, పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు రోడ్డుపై నిలుస్తున్న డ్రైనేజీ, వర్షపు నీటిని వెంటనే తొలగించి సమస్యను పరిష్కరించాలని జిల్లా వైద్య సిబ్బంది కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

ఇద్దరికి తీవ్ర గాయాలు..

యాచారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం నల్గొండ జిల్లా, నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన లింగయ్య(50) అతడి మిత్రుడు కోటేష్(25)లు బైక్‌పై వెళుతున్నారు. చౌదర్‌పల్లి గేటు వద్ద ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి ఢీకొనడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను పెట్రో మొబైల్-1 పోలీసులు బీఎన్‌రెడ్డి నగర్‌లోని వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నందీశ్వర్‌రెడ్డి చెప్పారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి తిట్టిందని ఇంటి నుంచి అలిగివెళ్లిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన హరీష్, విజయకుమారి దంపతులు కూలి పనులు చేసుకుంటూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బ్రాహ్మణపల్లిలో నివాసముంటున్నారు. కాగా, వీరి కుమారుడు తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కాకతీయ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. బాలుడిని ఉదయం తల్లి తిట్టడంతో షాప్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లకుండా తుర్కయంజాల్ నుంచి ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వైపు నడుచుకుంటూ వస్తుండడంతో అక్కడ పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసులు 9ఏళ్ల బాలుడిని ఆపి వివరాలపై ఆరా తీశారు. దాంతో అతడు ఇంటి నుంచి పారిపోయి బయటకు వచ్చానని తెలుసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారికి అప్పగించారు. ఈమేరకు తప్పిపోయిన బాలుని విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను సీఐ అభినందించారు.

గట్టిప్పలపల్లి పీహెచ్‌సీ సేవలపై ఎమ్మెల్యే అసంతృప్తి

- డాక్టర్, నలుగురు సిబ్బంది గైర్హాజరు పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి ఆగ్రహం
- చర్యలకై డీఎంహెచ్‌వోకు ఆదేశం
- వైద్యురాలు, సిబ్బందిపై స్థానికుల ఫిర్యాదు


రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టిప్పలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్‌తో పాటు సిబ్బంది గైర్హాజరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న తరుణంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సింది పోయి.. విధులకు హాజరు కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల నిల్వలు, పరిసరాలు పరిశీలించారు. ఎమ్మెల్యే తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్ సైదమ్మ లేక పోగా.. ఏడుగురు సిబ్బందిగాను కేవలం ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారు. ముందస్తు అనుమతి లేకుండా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. డాక్టర్ సైదమ్మతో పాటు సిబ్బంది చాలామంది విధులు సరిగ్గా నిర్వహించడం లేదని.. దాంతో ఆసుపత్రి మొక్కుబడిగా పనిచేస్తుందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. విధులు సరిగ్గా నిర్వహించని వైద్యురాలు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వైద్య చికిత్సలకు వచ్చిన రోగులు కోరారు. ఎమ్మెల్యే డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని తెలిపి వెంటనే విధులకు గైర్హాజరైన, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యురాలు సైదమ్మ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణమే మెమోలు జారీ చేయాలని సూచించారు.

ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు

ఆమనగల్లు : కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ పథకాల కింద చేపడుతున్న పనులను పరిశీలించి నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీలు రూ. 5.75 లక్షల చెక్కులను అందజేశారు. పలుగ్రామాలలో నెలకొన్న సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గట్టిప్పలపల్లిలో మృతిచెందిన వెంకటయ్య, అంజయ్యల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, రఘురాములు, శేఖర్ గౌడ్, దారెడ్డి అంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి నిరసన

తాళికట్టి ముఖం చాటేశాడని ఆవేదన


గణేశ్ ఇంటి వద్ద నిరసనకు దిగిన ప్రవళిక

నందిగామ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన ప్రియుడు పెళ్లి చేసుకుంటానని, శారీరకంగా వాడుకొని తీరా పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో ముఖం చాటేసి మోసం చేశాడని ప్రియురాలు ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళన దిగిన ఘటన నందిగామ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన నానగారి ప్రవళిక (21) తన ఇంటి సమీపంలో ఉన్న కొమ్ము గణేశ్‌తో ఎనిమిదేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తుందని, ఆ మధ్య కాలంలోనే తనకు తాళి కూడా కట్టాడని వెల్లడించింది. తదనంతరం ఇరువురి మధ్యన చిన్న చిన్న ఘర్షణలు తలెత్తడంతో కొంతకాలం పాటు తాను ప్రియుడికి దూరంగా ఉన్నానని తెలిపింది. ఈ క్రమంలో తన తల్లితండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, పెళ్లి విషయం వారి ఇంట్లో చెప్పి కాపురానికి తీసుకువెళ్లాలని ప్రియుడు గణేశ్‌కు విన్నవించినట్లు తెలిపింది. ఇదివరకే మన పెళ్లి జరిగిందని, ఇతర సంబంధాలకు ఒప్పుకోరాదంటూ చెప్పడంతో వచ్చిన ప్రతి సంబంధాన్ని చెడగొట్టుకున్నాని ఆవేదన వ్యక్తం చేసింది. గత కొద్ది నెలలుగా తనను కాపురానికి తీసుకువెళ్లకుండా ఏవో కారణాలు చెబుతూ వస్తున్నాడని వెల్లడించింది.

ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమే..

తన పెళ్లికి సంబంధించి ప్రవళిక ఫిర్యాదు చేసింది వాస్తవమేనని, కేసు మాత్రం నమోదు చేయవద్దని ఆమె తెలిపినట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు. ఒకవేళ ఆమె కేసు నమోదు చేయమంటే చేస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


ఆరుట్లలో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలశంకర్

మంచాల/కొందుర్గు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఆరుట్లలో పర్యటించి నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. వర్షాలకు కూలిపోయిన పెంకుటిళ్లను పరిశీలించి బాధితులను పునరావాస కేంద్రాలకు తలించాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సమస్యలు తెలుసుకున్నారు.

మహదేవ్‌పూర్ బడికి ప్రహరీ నిర్మించాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యేను కోరిన సీపీఐ నాయకుడు నర్సింహా

కొందుర్గు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని మహదేవ్‌పూర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు నర్సింహా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. గ్రామంలోని పాఠశాల, అంగన్వాడీ భవనాలకు ప్రహరీ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు సూచించినట్లు నర్సింహా పేర్కొన్నారు.

అవినీతి అధికారుల్లో గుబులు

(ఐదో పేజీ తరువాయి)

తగిన శాస్తి జరిగిందని కార్యాలయం వద్దకు వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు. 2021 ఆగస్టు 18న అప్పటి తహసీల్దార్ చందర్‌రావు ఏసీబీకి పట్టుబడ్డారు. చాలాకాలం తర్వాత తహసీల్దార్ కార్యాలయంపై మళ్లీ ఏసీబీ దాడితో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

ప్రతి పనికీ రేటు!

డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 16 మంది ఏసీబీ అధికారులు ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ప్రతి రికార్డును పరిశీలించారు. ఇటీవల కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, జరిగిన పనులకు సంబంధించి ఏసీబీ అధికారులు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి సమక్షంలో వివరాలు సేకరించారు. పట్టాదారు పాసు పుస్తకంలో జెండర్ సవరణకు రూ.లక్ష తహసీల్దార్, సర్వేయర్ డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు లలిత, రవిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ప్రధాన ద్వారం గేటుకు తాళాలు వేసి తమ అవినీతి తతంగాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు బహిర్గతమయ్యాయి. ఆమనగల్లులోని మరో రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా లంచాలకు మరిగిన అధికారులు ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారని ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఒక అధికారి తన సామాజికవర్గం వారితో కలిసి డబ్బు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

జీతాలు వెంటనే చెల్లించాలి : ఆశాలు


యాచారం : నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

శంకర్‌పల్లి/యాచారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కోశాధికారి స్వప్న ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం శంకర్‌పల్లిలో ఆశావర్కర్ల నోడల్ అధికారి పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రెండునెలల జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా సక్రమంగా ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఆవస్థలు పడాల్సివస్తున్నదన్నారు. ఆశా వర్కర్లు అమూల్య, వరలక్ష్మి, అమృత, లావణ్య, జ్యోతి, వెంకటమ్మ, సుకన్య, లలిత, ప్రమీల, యాదమ్మ, క్రిష్ణవేణి, అశ్విత తదితరులున్నారు. ఆశావర్కర్లకు నెలకు రూ.18వేల వేతనమందించాలని, పెండింగ్ సమస్యలు తీర్చాలని కోరుతూ యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ముందు ఆందోళన చేశారు. 2023లో 15రోజుల పాటు చేసిన సమ్మెకాలం వేతనాలందించాలని కోరారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని డిమాండ్ చేశారు. రూ.50లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందూనాయక్, బాలమ్మ, రమాదేవి, అంజమ్మ, అలివేలు, పద్మ తదితరులు ఉన్నారు.


శంకర్‌పల్లి : నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

పేద విద్యార్థినికి సైకిల్ అందజేత



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పేద విద్యార్థిని జాహ్నవికి సైకిల్‌ను బహూకరించారు. బాలిక పాఠశాలకు వెళ్లిరావడానికి వీలుగా సైకిల్‌ను ఇచ్చినట్టు తెలిపారు. బుగ్గారెడ్డి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఎ.మనోహర్‌రెడ్డి, షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మధన్‌మోహన్‌రెడ్డి, లయన్ అశోక్, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


కందుకూరు : పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కందుకూరు/యాచారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శులు దేవేందర్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. సెప్టెంబరు ఒకటిన చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించి మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంతో పాటు వివిధ ఉన్నత పాఠశాలలో పోస్టర్లు విడుదల చేశారు. మండల విద్యాధికారి నర్సింహ, బుచ్చయ్య, వినోద్, చంద్రశేఖర్, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేసే వరకూ శాంతియుతంగా ఆందోళన చేస్తామని పీఆర్టీయూ పత్రికా సంపాదకులు బి.జగన్ మోహన్‌గుప్త అన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్‌తో వచ్చే నెల ఒకటో తేదీన నగరంలో నిర్వహించే ధర్నా పోస్టర్‌ను యాచారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆ వరణలో విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు టీఎస్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలేష్ గౌడ్, యాదగిరి, నాయకులు సురేష్ తదితరులున్నారు.


యాచారం : పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

గణేశ్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి



కొందుర్గు : మాట్లాడుతున్న రూరల్ సీఐ నరసయ్య

కొందుర్గు/చౌదరిగూడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, మండలపాల ఏర్పాటుకు అనుమతులు తప్పని చేసుకోవాలని షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాలు, మండపాల నిర్వాహకులతో ఎస్సై రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటు అనుమతులు తప్పనిసరి చేసుకోవాలని అన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అలాగే ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని వీఎన్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ పార్టీల నాయకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. మండపాలకు నాణ్యమైన కర్రలు, ఇనుప పైపులు, రేకులను వినియోగించి పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాల ఆయన సూచించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు


కేశంపేట : చర్ల మైసమ్మ ఆలయం వద్ద భక్తులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట/కందుకూరు/కొందుర్గు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చర్ల మైసమ్మ బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మొదట గ్రామంలోని బొడ్రాయికి పూజలు చేసిన ఆయన చర్ల మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతరాజులతో కలిసి నృత్యం చేశారు. అంతకుముందు కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, ఏఎంపీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, శివశంకర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, రూప్లానాయక్, పర్వతాలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో చౌడమ్మ అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తులు ప్రతీయేటా చౌడమ్మ బోనాలు తీస్తారు. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పర్వత్ రెడ్డి, మల్లేష్ యాదవ్, జామాల్‌ఖాన్, గోపాల్, మురళీ, శేఖర్, తదితరులున్నారు. కందుకూరు మండలంలోని కొత్తగూడలో ఎల్లమ్మ తల్లి బోనాలను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఊరేగింపుగా తరలి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్‌లు ఎస్.మల్లారెడ్డి, ఆర్. యాదయ్య, నాయకులు బొక్క సంజీవరెడ్డి, ఎస్ శేఖర్‌గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఎండి ఖదీర్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, మక్తాల వెంకటేష్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, కుమ్మరి కృష్ణయ్య, రాజశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు. మల్లన్న బోనాల వేడుకలను పురస్కరించుకుని అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్‌లో శ్రావణ మాస వేడుకలను పురస్కరించుకుని గ్రామస్థులు వైభవంగా వేడుక నిర్వహించారు.


కందుకూరు : కొత్తగూడలో పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలిన గ్రామస్తులు

కళాశాలకు రూ.5 లక్షల సామగ్రి వితరణ

తలకొండపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సౌకర్యార్థం తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీపునుంతల గ్రామానికి చెందిన ఉన్నతి శిక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎర్ర సుధాకర్‌రెడ్డి రూ. 5లక్షల సాయగ్రి సమకూర్చారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతుల కల్పనకు సుధాకర్‌రెడ్డి కొంత కాలంగా తోడ్పాటునందిస్తున్నారు. అమెరికాలో ఉంటున్న ఆయన కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు పేద విద్యార్థులకు తోడ్పాటునందించాలన్న సంకల్పంతో ఉదారంగా సాయమందిస్తున్నారు. తలకొండపల్లి జూనియర్ కళాశాలకు రూ. 5లక్షల విలువ చేసే 40 బెంచీలు, ఐడీ కార్డులు, కంప్యూటర్, ప్రింటర్, రెండు జతల డ్రెస్సులు, బీరువా, నోట్‌బుక్‌లు, చైర్స్, క్రీడా సామగ్రి సుధాకర్‌రెడ్డి సమకూర్చారు. మంగళవారం ప్రిన్సిపాల్ మాధవరావుకు అందజేశారు.

గ్రామానికి బీటీ రోడ్డు వేయండి

యాచారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొమ్మోనిబాయి గ్రామానికి బీటీ రోడ్డు వేయించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు నందివనపర్తి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రమందించారు. మట్టిరోడ్డు కారణంగా వర్షాకాలంలో రోడ్డంతా బురదగా మారడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామన్నారు. తమ గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

షాబాద్ : నూనె గింజల సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చునని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మతూర్ అన్నారు. రేగడిదోస్వాడలో నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన నిర్వహించి, నూనెతీసే యంత్రాన్ని ప్రారంభించారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహద పడుతాయని ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.

చేవెళ్ల : కుమ్మెరకు చెందిన వీరేశం కొంతకాలంగా ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల చేవెళ్ల పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కిసాన్ సంఘ్ కార్యక్రమంలో రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం, పశుపోషణపై ఎన్ఆర్ఐలు అవగాహన కల్పించారు. కిసాన్ సంఘ్ నాయకుడు, దాత రాజేందర్‌రెడ్డి, సునీల్‌లు కలిసి గుజరాత్‌లో దేశవాళీ ఆవును కొనుగోలు చేసి వీరేశంకు అందజేశారు.

మంచాల : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మంచాలలో జరిగిన సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల మహాసభలో వారు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : అనుమతిలేని ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇష్టానురీతిగా రోడ్లపై తిరుగుతున్న బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

మహేశ్వరం : కళాశాల ఆవరణలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు.

యాచారం : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, కేంద్ర,రాష్ట్ర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గడ్డమల్లాయాగూడకు చెందిన డ్వాక్రాసంఘాల మహిళలకు ఎంఎస్ఎంఈ, ఎన్ఐఆర్డీ, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

కడ్తాల్ : మండల కేంద్రానికి చెందిన కేశని యాదయ్య పాముకాటుకు గురై ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి వెళ్లి పరామర్శించారు.


కేజీబీవీ సిబ్బంది పనితీరుపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం

ఆమనగల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సిబ్బంది పనితీరు పట్ల మున్సిపల్ కమిషన్ శంకర్ నాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఆమనగల్లు కేజీబీవీని మంగళవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. వంటకాలను పరిశీలించి నాణ్యతగా, మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్‌కు మూత లేకపోవడం, పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు చిందర వందరగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని ఎస్‌వో పద్మజ్యోతికి సూచించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఆదిబట్ల/షాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని షాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్, మండలాధ్యక్షుడు కుర్వ మల్లేష్, ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి లక్ష్మణ్, నాయకుడు రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందిన ఫొటోగ్రాఫర్ జంగిలి అరుణ్ కుమార్ కుటుంబానికి తోటి ఫొటోగ్రాఫర్లు అండగా నిలిచి రూ.24వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫొటోగ్రాఫర్ల జిల్లా నాయకులు ప్రభుదాస్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్‌కు చెందిన అరుణ్‌కుమార్ అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు.

సంక్షేమ భవనానికి స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న ప్రతినిధులు

మంచాల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమభవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం సంఘం ప్రతినిధులు తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సంఘం మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, గౌరవాధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి అశ్వాల వెంకటేష్, కోశాధికారి రమేష్, తదితరులున్నారు.